క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మించాలి



సీసీ రోడ్డుకు సైతం నోచుకోని చింతమానుగూడ గ్రామం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి పంచాయతీ చింతమానుగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో సీసీ రోడ్డు లేకపోవడంతో రాళ్లు తేలి అధ్వానంగా ఉందని, నిత్యం రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి వీధిలో సీసీ రోడ్డుతో పాటు కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన

● ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలని 19వ వార్డు పరిధిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లో మాత్రమే చెత్త వేయాలని సూచించారు. అనంతరం పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



వైఎస్సార్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నినదించారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షిస్తూ హెచ్‌ఎం సీహెచ్ సోమేశ్వరరావు నేతృత్వంలో విద్యార్థులు పాఠశాల నుంచి వైఎస్సార్ కూడలి వరకు గురువారం సైకిల్ ర్యాలీ చేపట్టారు.

పాలకొండలో వర్షం



పాలకొండలో కురుస్తున్న గాలులతో కూడిన వర్షం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల పాలకొండ, పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గాలులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 25 వేల ఎకరాల్లో వరి దుబ్బు, పొట్ట దశకు చేరుకోగా పలు గ్రామాల్లో వర్షపునీరు పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు అధికారుల సూచనలు పాటిస్తున్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నది తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారిని గురువారం వందలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నేత్ర వైద్యాధికారి ప్రసాదరావు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మంది విద్యార్థులకు కంటిఅద్దాలు అవసరమున్నట్లు ఆయన గుర్తించారు. విద్యార్థులు ఆకుకూరలు ఎక్కువగా తినాలని, కంటి నిండా నిద్రించాలన్నారు. కంటి రక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. టీవీలు, ఫోన్లు చూడకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మద్రావు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరికి తెగులు.. అన్నదాతకు దిగులు



వరిని ఆశించిన సుడిదోమ

- వరుస వర్షాలతో ఆందోళనలో రైతులు
- ముందస్తు సస్యరక్షణతో తెగుళ్లకు చెక్ : వ్యవసాయాధికారులు

పాలకొండ రూరల్:

ఖరీఫ్ ప్రారంభం నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభ సమయంలో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న కర్షకులకు ప్రస్తుత వరుస తుఫాన్లు, వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నియోజకవర్గంలో సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుంది. ఈ తరుణంలో వర్షం అతివృష్టి కారణంగా లోతట్టు పొలాల్లోకి నీరు చేరడంతో తెగుళ్లు ఆశిస్తున్నాయి. పాలకొండ మండలం చిన్న, గొట్ట మంగళాపురం, వీరఘట్టం రహదారి ప్రాంతం, తుమరాడ, చింతాడ, తదితర ప్రాంతాల్లో వరి పంటకు కాండం కుళ్లు తెగులు బయటపడింది. మరికొన్ని చోట్ల



తెగులు నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

సుడిదోమ ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పొట్ట దశకు చేరుకున్న సమయంలో తెగుళ్లు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సమయంలో సస్యరక్షణపై దృష్టి సారిస్తే ఫలితం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో తెగుళ్లను గుర్తించి, నివారణ చర్యలను సూచిస్తున్నారు.

తెగులుతో నష్టం ..



కీలక దశలో వరుస వర్షాలు, ఉక్కబోత కారణంగా సుడి దోమ, కుళ్లు తెగులు పంటకు ఆశిస్తుంది. ఒకరి పొలంలో దోమ కనిపిస్తే గంటల వ్యవధిలో పక్క పొలాలకు పాకిపోతోంది. నివారణ చర్యలపై అధికారులు వివరించాలి. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న గ్రామాల్లో అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

– ఎస్.రాము, రైతు, పాలకొండ మండలం

తెగులు సోకే విధానం..

ఖరీఫ్ ప్రారంభ దశలో వరుసగా వర్షాలు కురవడం, తర్వాత ఎండల ఉధృతి, మళ్లీ తాజాగా వర్షాలు కురుస్తుండడంతో సుడిదోమ తెగులు బాగా వృద్ధి చెందుతోంది. పైరు మొదళ్లలో ఈ దోమలు అధిక సంఖ్యలో దర్శనమిస్తాయి. పైరులో నిల్వ ఉన్న నీటిపై భాగంలో తేలి ఆడుతూ, చేను మొదలు చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చి వేస్తాయి. ఈ క్రమంలో ఆకు రంగుమారి పసుపు వర్ణంలోకి మారుతుంది. వీటి ఉధృతి అధికంగా ఉంటే చేను మధ్య నిల్వ ఉన్న నీటిపై నూనె తెట్టులాగా కనిపిస్తుంది. దీనినే హాఫ్‌బర్న్‌గా కూడా పిలుస్తారు. పొట్టదశలో వస్తే గింజ రాదు. గింజ దశలో ఆశిస్తే దిగుబడి పడిపోతుంది. నూక శాతం అధికంగా వస్తుంది. ఒక్కోసారి పూర్తిగా పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

సస్యరక్షణ ఇలా...

ఈ తరహా దోమలను పొలంలో 5 నుంచి 10 గుర్తిస్తే తూర్పు, పడమర దిశల్లో రెండు మీటర్ల దూరంలో చేనును పాయలుగా విడదీసి, కాలిబాటలు ఏర్పాటు చేయాలి. దీని వల్ల గాలి, వెలుతురు సోకి దోమ ఉధృతి తగ్గుతుంది. పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపితే దోమల గుడ్లు, చిన్నదోమ నశిస్తాయి. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనే 15 వందల పీపీఎంను సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది. సరైన సమయంలో స్పందించకుంటే దోమ ఉధృతిని అడ్డుకోలేమని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి చెబుతున్నారు.

● సారూ.. ఒక్కసారి చూడరూ..



పాలకొండ డివిజన్ కేంద్రం నుంచి సీతంపేట, కొత్తూరు, భామిని మీదుగా ఒడిశా వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అనేక మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమీపంలో ఇంతటి అధ్వాన్న రోడ్డు ఉన్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. శుక్రవారం జరగనున్న పర్యాటక దినోత్సవానికి ఆడలి వ్యూపాయింట్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డు మీదుగానే వెళ్లనున్నారు. ఇప్పటికైనా రోడ్డు పరిస్థితినిగుర్తించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – పాలకొండ రూరల్

రాష్ట్రాభివృద్ధికి కృషి..

వీరఘట్టం: రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేజర్ పంచాయతీ ఈఓ ఎం. రవి కోరారు. స్వర్ణాంధ్ర – 2047 కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జామి లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జామి లక్ష్మీనారాయణ

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పెదగుడబ సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెదగుడబలో అంగన్‌వాడీ వర్కర్లతో పౌష్టికాహారం ఆవశ్యకతపై ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రక్తహీనత లేకుండా అవసరమైన పోషక పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు చింతాడ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆందోళన



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

భామిని: మండలంలోని ఏటీబీ రహదారి పరిస్థితి అధ్వానంగా మారిందని సీపీఎం నాయకులు గురువారం ఆందోళనబాట పట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు జి.కూర్మనాయకులు మాట్లాడుతూ.. భారీ వాహనాల రాకపోకలు, అధిక వర్షాల కారణంగా రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కె.మిన్నారావు, భాస్కరావు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు బందోబస్తు

● డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ ఎం. రాంబాబు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే నెల 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో రెండో తేదీ నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వస్తాయని చెప్పారు. ప్రధానంగా భారీ వాహనాలను పట్టణంలోనికి అనుమతించమని, ఇందుకోసం అన్నవరం గ్రామం మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆర్డీఓ కార్యాలయం సమీపంలోను, రాజాం రోడ్డులోని ఆర్‌అండ్‌బీ స్థలం వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారుగా 300 మంది పోలీసులను బందోబస్తు కోసం వినియోగిస్తున్నామని చెప్పారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): భౌతిక దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కురుపాం మండల కేంద్రంలోని గౌడు వీధికి చెందిన గౌడు శ్రీధర్ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి గల కారణాలు, అందిన వైద్య సేవలు, పోలీసుల చర్యలపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

రహదారికి మరమ్మతులు

గరుగుబిల్లి: పార్వతీపురం – గరుగుబిల్లి ప్రధాన రహదారి పరిధిలో ఉల్లిభద్ర వద్ద ఏర్పడిన గోతులను ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం గ్రావెల్ వేసి పూడ్చారు. ఈ రహదారి పరిధిలో పలు గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ ఇప్పటికే రెండు సార్లు రహదారిలో వున్న గోతులను గ్రావెల్‌తో సరి చేశారు. అయినప్పటికీ వర్షాలు కురవడంతో గోతులు మళ్లీ ఏర్పడ్డాయి. దీంతో ఎస్‌ఐ స్పందించి రహదారి గోతుల్లో గ్రావెల్‌ను, మట్టిని వేసి పూడ్చారు. ఎస్‌ఐ చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాము, సిబ్బంది శంకరనాయుడు, సుధాకర్, పెద్దూరు, ఉల్లిభద్ర గ్రామ యువత పాల్గొన్నారు.



రహదారిలో ఏర్పడిన గోతులను పూడ్చుతున్న ఎస్‌ఐ తదితరులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: పట్టణం, సాలూరు మండలంలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం, మండలంలోని తోణాం విద్యుత్ ఫీడర్‌ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఫీడర్ల పరిధిలో ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరా యం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారు లు సహకరించాలని కోరారు.

గోదాం తనిఖీ

సీతంపేట: స్థానిక పౌరసరఫరాల శాఖ గోదాంను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు బియ్యం బస్తాలు, నూనెలు, ఇతర సరుకులు రికార్డుల ప్రకారం ఉన్నాయా లేదా అనేది చూశారు. బస్తా బరువులు సరి చూడడంతో పాటు శాంపిల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, తూనికలు, కొలతల అధికారి రంగారెడ్డి, ఆహారభద్రత అధికారి రామయ్య, సివిల్ సప్లయిస్ డీటీ రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

ఆర్‌ఐటీఐలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ రేపు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు మిగులు సీట్లు భర్తీ నిమిత్తం నాల్గో విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 28న నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ మేరకు ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మోటార్ మెకానిక్, వెల్డర్, కోపా, డ్రెస్ మేకింగ్ ట్రేడుల యందు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు.

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి బాబూ..?



ర్యాలీ చేపడుతున్న రైతు సంఘ నాయకులు

● ఏపీ రైతు సంఘ నాయకులు

పాలకొండ రూరల్: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు తాము అండగా ఉంటామని.. ఎన్నికల సమయంలో తాము రైతు పక్షమని ఊదరగొట్టిన కూటమి నాయకులు వారికి ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ఏపీ రైతు సంఘ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు గడిచినా రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు నేటికీ అందించలేదన్నారు. తక్షణమే పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు, తదితరులు మాట్లాడుతూ.. తెలంగాణ మాదిరిగా ఏపీ రైతుకు రూ.2 లక్షలు, కౌలు రైతులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు కార్డులు అందించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

పార్వతీపురం టౌన్: బాలల చట్టాలపై అవగాహన అవసరమని లీగల్ కమ్ ప్రొఫెషనల్ అధికారి పి.శ్రీధర్ అన్నారు. పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, దత్తత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిరోధక చట్టం, 18 ఏళ్లలోపు బాలికలు వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. చెడు, మంచి స్పర్శపై అవగాహన కల్పించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా 1098 నంబరు కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసేందుకు ప్రజల సహకారం అవసరమని సర్పంచ్ బి.అప్పడు అన్నారు. మండలంలోని రావివలసలో గ్రామ సభను పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కె.భరత్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రజలు తమ సలహాలను, సూచనలను అందించాలన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ భరత్‌కుమార్

బడి తోటలు నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో బడి తోటలను తప్పకుండా నిర్వహించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులకు గురువారం ఆమె కూరగాయలు, ఆకు కూరల విత్తనాలను పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మన బడి మన తోట పథకాన్ని ప్రతీ పాఠశాలలో అమలు చేయాలని, తద్వారా పండిన కూరగాయలు, ఆకు కూరలు మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వండి పెట్టి పోషకాహారం అందేలా చర్యలు చూపాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.చంద్రశేఖర్, హెచ్‌ఎం బిడ్డిక భీముడు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు కూరగాయల విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పాలకొండ రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సామాజిక కార్యకర్త తోట ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వేంకటేశ్వర ఒకేషనల్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల పుట్టే బిడ్డల్లో మానసిక ఎదుగుదల ఉండదని చెప్పారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించే పోస్టర్లు ఆవిష్కరించారు.



బ్యాల వివాహాలపై అవగాహన కల్పించే పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, సోషల్ వర్కర్స్

తాగునీటి కోసం ఆందోళన

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి ప్రధాన సమస్య మంచినీరేనని, జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్న నీటి సమస్యకు పరిష్కారం ప్రభుత్వాలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. నిరంతరం ప్రజల సమస్యలను దారి మళ్లించేందుకు ప్రభుత్వాలు అనేక కుట్రలు పన్నుతున్నాయన్నారు. యావత్తు జిల్లా యంత్రాంగం మొత్తం పట్టణంలో తిష్ట వేసుకుని కూర్చుందని, సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నిలిచిందని ఆమె విమర్శించారు. మంచినీటి సమస్య ఈనాటిది కాదని కొన్ని సంవత్సరాలుగా పట్టణ ప్రజలను పట్టి పీడిస్తుందన్నారు.

శ్రీవారి లడ్డూ వివాదం సర్కారు సృష్టే..

- కూటమి పాపాలను కడిగేందుకు పూజలు చేయండి
- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

భామిని: పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై విషం చిమ్ముతూ వివాదం సృష్టించింది కూటమి సర్కారేనని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. ఈ క్రమంలో కూటమి పాపాలను కడిగేందుకు స్థానికంగా అన్ని ఆలయాల్లో పూజలు చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని సతివాడలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో అపచారం జరిగిందంటూ కూటమి నాయకులు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారంతో హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నారన్నారు. కేవలం ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని మండిపడ్డారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వీరి పాపాలను తిప్పి కొట్టే క్రమంలో ఈ నెల 28న అన్ని ఆలయాల్లో పూజలు చేయాలని ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం చిన్న దిమిలి, సతివాడ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన తమ పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈమె వెంట వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు టి.అన్నాజీరావు, పి.రాంబాబు, కె.చంద్రశేఖర్, సర్పంచ్‌లు ఎం.మోహనరావు, జె.ప్రభాకర్, పి.హరిబాబు, చలపతి,రమణ, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు